

# సంసారంలో సరిగమలు

## - తమస్విని



*(ప్రతి  సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## పరుగు

**"ఇంకా రెడీ అవలేదా?** ఐదింటికల్లా తయారై ఉండు, నేను రాగానే సినిమాకి వెళ్దాం అని చెప్పాగా?" కౌసల్య కోపంగా అడిగింది.

"అప్పుడే ఐదయిందా? కాలం ఇలా పరిగెత్తితే నాదా తప్పు?" బద్ధకంగా చెప్పాడు ప్రాణేష్.

"నీ బద్ధకంతో ఒళ్ళుమండిపోతోంది ప్రాణేష్. పొద్దుట్నించి ఇంట్లో ఏం చేసావు చెప్పు? దొర్లింది చాలుకాని లేచి తయారవ్వు. టిక్కెట్లుకూడా తెచ్చాను."

కౌసల్య మొహం కడుక్కుని చీరమార్చుకుని వచ్చేసరికి ప్రాణేష్ మంచం మీద అదే భంగిమలో ఉన్నాడు. దిండుతో మొహం మీద కొడుతూ చెప్పింది.

"లేవమన్నానా? సినిమాకి వెళ్తున్నామని చెప్పినా షేవ్ చేసుకోలేదే?"

"సెలవురోజు కూడా ఈ సినిమాలు, గడ్డాలు ఏమిటి కౌ. హాయిగా పడుకోనివ్వచ్చుగా?" కళ్ళు తెరవకుండానే చెప్పాడు.

"కౌ ఏమిటి? పూర్తిపేరుతో పిలవడానికి కూడా బద్ధకించేవాడిని నిన్నే చూసాను. సెలవురోజు తినడంలేదూ? అలాగే మిగిలిన పనులుకూడా చేయాలి" అరిచింది.

ఇక తప్పదన్నట్లుగా లేచి పేంట్ వేసుకుంటూ చెప్పాడు ప్రాణేష్.

"హీరోయిన్స్ ఆకలిగా ఉంటారు కౌ. చూడాలనిపించదు"

"ఆకలిగా ఉంటారా? నీలో ఈ కోణం కూడా ఉందా?" ఆశ్చర్యపోయింది కౌసల్య.

"కళ్ళల్లో ఆకలికాదు. కడుపులో ఆకలి. లావై పోతామని పాపం తినరు. డొక్కలు ఎండుకుపోయి అస్తిపంజరాల్లా హీరో వెనక పరిగెత్తుతూంటారు. షూటింగ్ టైంలో నాలుగైదుసార్లు స్పృహతప్పిపోయి ఉంటారని నా డౌట్. సోమాలియావాళ్ళు మారథాన్‌లా వాళ్ళ పరుగుని ఎంజాయ్ చేయలేను. నేను ఇంట్లో ఉంటా. నువ్వు ఒక్క దానివే వెళ్ళచ్చుగా?" ఆశగా అడిగాడు.

"చంపుతా. నీ భూతదయకి జోహార్లు కాని ఇక నడు" కసిరింది.

"అయితే ఒక రిక్వెస్ట్ నువ్వే డ్రైవ్ చేయాలి."

"నువ్వేం చేస్తావు? పక్కన కునికిపాట్లు పడతావా? సరేలే" ఒప్పుకుంది.

చమత్కారి అయిన దేవుడు ఉరికే ఉత్సాహంలాంటి కౌసల్యకి, ఊపిరి పీల్చుకోడానికి కూడా బద్ధకించే ప్రాణేష్‌కి ముడిపెట్టాడు. ఒకరిమీద ఒకరికి అవ్యాజమైన ప్రేమున్నా, ఒకరి స్వభావం మరొకరికి నచ్చక అది బయటకి వ్యక్తం కాదు.

"కౌసల్యది రజోగుణం. నీది తమోగుణం. నీ తమోగుణంతో నువ్వేం సాధించలేవు కాని ఆ అమ్మాయి చెప్పిన దానికి సరే అని తలూపుతూ ఉండు. సంసారం బరువు బాధ్యతలన్నీ చక్కగా మోస్తుంది." మేనమామ ప్రాణేష్‌కి ఉద్బోధ చేసాడు.

బరువు, బాధ్యత అనే మాటలంటే భయపడే ప్రాణేష్ మేనమామ సలహాని పాటిస్తూ కౌసల్యకి లొంగిపోయాడు. గవర్నమెంట్ కాలేజ్‌లో తెలుగు లెక్చరర్‌గా పనిచేసే ప్రాణేష్‌కి బోలెడు సెలవులు. స్టేట్‌గవర్నమెంట్‌లో ఆఫీసర్‌గా పనిచేసే కౌసల్యకి వారానికి ఆరురోజుల పని. శనివారాలు ఇంట్లో ఉండే భర్త చిన్న చిన్న రిపేర్లు, షాపింగ్‌లు చేయాలని కౌసల్య కోరిక. సెలవురోజుల్లో కేవలం తినడానికే లేవాలన్నది ప్రాణేష్ భావన.

"బట్టలారేసే తాడు తెగిపోయింది కొత్తది కట్టమని చెప్పాగా. కట్టావా" ఆ రాత్రి అడిగింది కౌసల్య.

"సారీ కౌ. పొద్దున గుర్తొచ్చింది. కాఫీ తాగి కడదామనుకున్నాను. కానీ మర్చిపోయా. ఇప్పుడు నువ్వు గుర్తుచేసేదాకా గుర్తురాలేదు. రేపు తప్పకుండా కడతా ప్రామిస్" ప్రాణేష్ తలమీద చెయ్యిపెట్టుకుని చెప్పాడు.

"అసలే చిన్న బాల్కనీ. బట్టలారేయడానికి ఉంది రెండు తాళ్ళు. అందులో ఒకటి తెగింది. మరి రేపు పనమ్మాయి ఉతికిన బట్టల్ని ఎక్కడ ఆరేస్తుంది? నాకంటే పొడుగ్గా ఉంటావు, కాస్త ఎత్తుగా కడతావని కదా నీకు చెప్పింది. చిన్నపని చేయడానికి కూడా ఎందుకు వాయిదా వేస్తావు?" నిస్సహాయంగా చెప్పింది కౌసల్య.

"నిజ్జంగా రేపు కడతానన్నానుగా. ఇక వదిలెయ్." అసహనంగా చెప్పాడు ప్రాణేష్.

వారం తర్వాత ఇన్విజిలేషన్‌కి దూరంగా ఉన్న కాలేజ్‌కి వెళ్ళి ఆలస్యంగా ఇంటికి వచ్చిన ప్రాణేష్‌కి గుమ్మంలో నుంచున్న భార్య కనిపించింది. ఆమె ఎదురు గుమ్మంలో నుంచున్న ఓ అందమైన యువకుడితో మాట్లాడుతోంది.

"ప్రాణేష్! ఇతను శ్రీకర్. మన ఎదుటి ఫ్లాట్‌లోకి అద్దెకి వచ్చాడు.... ఈయన ప్రాణేష్ నా ప్రాణ విభుడు" కౌసల్య ఇద్దరికీ పరిచయం చేసింది.

తనకన్నా అందంగా, మంచి పర్సనాలిటీతో ఉన్న శ్రీకర్‌ని కొద్దిగా ఈర్ష్యగా చూసాడు ప్రాణేష్.

"ఆ అబ్బాయి ఎంత చురుకో" లోపలి వచ్చి తలుపు బోల్ట్ పెట్టి చెప్పింది కౌసల్య.

లోలోపల ఉడుక్కున్నాడు ప్రాణేష్.

"కౌ. తాడివ్వు కడతా" ఆ ఆదివారం తప్పదన్నట్లుగా అడిగాడు ప్రాణేష్.

"ఎక్కడ? నా మెళ్ళోనా? ఆల్‌రెడీ కట్టేసావుగా? ఐనా నాకో డౌట్. మూడు ముళ్ళు వేసావా? లేక బద్ధకంగా ఒకటే వేసి ఊరుకున్నావా?" అడిగింది కౌసల్య.

"ఆ తాడు కాదు. బట్టలతాడు"

"పోన్లే. ఉరితాడేమో అని భయపడ్డా. ఐనా నువ్వలా చంపలేవులే. తాడుని ఉచ్చులా ముడేయాలి. దాన్ని మెడకి తగిలించాలి, అంతపని నువ్వు ఎప్పుడు చేయాలి?" ఎగతాళిగా చెప్పింది.

సమాధానం చెప్పలేక ముఖం ముడుచుకున్నాడు.

"స్టూల్ వేసుకుని నేను కట్టేసాలే. ఆడవాళ్ళకి ఉండే ఈతిబాధలు నీకు తెలీదు. వర్షం వస్తూంటే 'పకోడీలు వండవా?' అని నువ్వడుగుతావు.

'అమ్మో! బట్టలు' అని నేను బయటకి పరిగెత్తుతాను. ఇంటి బాధ్యత తీసుకోవాలని అసలు అనుకోవు. జీతం తెచ్చిస్తే సరిపోతుందా? కొంచెమైనా పట్టించుకోవాలికదా?" నిష్ఠూరంగా చెప్పింది కౌసల్య.

"నేను కడతానన్నాకదా? నువ్వెందుకు కట్టావు? పైగా ఉపన్యాసాలు" సణిగాడు.

"నీకు వేసవి సెలవులు ఎప్పటి నించి?" కౌసల్య అడిగింది.

"వచ్చేనెల పదహారు నించి. ఏం?"

"ఏం లేదు. ఊరికే అడిగాను. మొన్న బేంక్‌లో వేయమని చెక్ ఇచ్చాను డ్రాప్ బాక్స్‌లో వేసావా?"

"అయ్యో! మర్చిపోయాను కౌ. రేపు వేస్తాలే."

"ఎందుకింత బద్ధకస్తుడిలా తయారయ్యావు? అసలు పిల్లలకి పాఠాలెలా చెప్తున్నావు?" అరిచింది కౌసల్య.

"అంత చిన్న విషయానికి ఆ అరుపులేంటి? రేపు వేస్తానన్నాగా?" తిరిగి అరిచాడు.

"చిన్న విషయమా? వడ్డీ నష్టం. కాలేజీ దారిలో కొద్దిగా పక్కకి వెళ్తే బేంక్ ఉంటుంది. ఆ కొంచెం దూరంకూడా అదనంగా వెళ్ళలేవు. బద్ధకం! రేపు వేద్దాంలే. ఇంకో రెండు నిమిషాల దూరం అనుకుంటావు. ఎప్పుడు వేసినా దూరం తగ్గదుకదా? అదేదో ముందే వేస్తే నాకీ టెన్షన్, నీకు తిట్లు తప్పేవి కదా?"

"నీకు బిపి వచ్చిందేమో ఓసారి టెస్ట్ చేయించుకో" సలహా ఇచ్చాడు.

"నీలాంటి వాడిని కట్టుకున్నాక బిపి రాక ఇంకేం వస్తుంది."

ఆ రాత్రంతా కౌసల్య భర్తతో మాట్లాడలేదు.

వేసవి సెలవలు ప్రారంభమైన రోజు ఆఫీస్‌కి వెళ్తూ కౌసల్య భర్త చేతికి ఓ కాగితం ఇచ్చింది.

"ఏమిటిది?" బద్ధకంగా అడిగాడు.

"తెలుగులోనే రాసాను చదువు."

"నీకీ మధ్య వెటకారాలు ఎక్కువయ్యాయి."

"నీ పుణ్యమే." నవ్వి వెళ్ళిపోయింది.

మధ్యాహ్నం ఆ కాగితం విషయం గుర్తొచ్చి తీసి చదివాడు. అది ఉత్తరంకాదు సరుకుల లిస్ట్ కూడా కాదు. ఆ సెలవుల్లో అతనేం చేయాలో రాసిన పనుల జాబితా.

1. గెస్ట్‌రూంలో మంచం కిరకిరమంటోంది. స్క్రూలు బిగించాలి.
2. వాష్‌బేసిన్‌లో చుక్క చుక్క నీరు పోతోంది. ప్లంబర్‌ని పిలిచి పంపు బాగుచేయించాలి.
3. వాషింగ్ మెషీన్ సరిగ్గా పనిచేయడంలేదు. కస్టమర్ కేర్‌కి ఫోన్ చేసి కంప్లైంట్ ఇవ్వాలి.

4. ఫ్రిజ్‌లో ఉన్న గిన్నెలు, పదార్థాలు అన్నీ బయటికి తీసి ఫ్రిజ్‌ని శుభ్రంగా తుడిచి అన్నీ మళ్ళీ లోపల సర్దాలి.

5. న్యూస్‌పేపర్లు ఎక్కువై అలమర్లు నిండిపోయాయి. వాటిని తీసుకెళ్ళి అమ్మాలి.

6. బెడ్‌రూం ఫేన్ హైలో పెడితే విపరీతమైన మోత వస్తోంది. ఎలక్ట్రీషియన్‌ని పిలిచి చూపించాలి.

7. టి.విలో కొన్ని హిందీ ఛానల్స్ రావడంలేదు. కేబుల్ వాడికి ఫోన్ చేసి పిలిచి ట్యూన్ చేయించాలి.

8. కారులో ఆయిల్ ఛేంజ్ చేయించాలి.

9. బీరువా పక్కన చెత్త కవర్‌లో పాతబట్టలు పెట్టాను. ఓల్డేజ్ హోంలో ఇచ్చిరావాలి.

10. పెద్ద కుక్కర్‌కి సేఫ్టీ వాల్వ్ పోయింది. వేయించుకురావాలి.

- ఇంట్లో ఎవరం ఉండక పెండింగ్‌లో ఉన్న పనులివి. ఈ సెలవుల్లో నువ్వే పూర్తిచేయాలి.

ఈ పది పనులు చేసాక, ఇంకో పది చెప్తాను. భర్త అంటే భరించువాడు అని తెలుగు మాస్టారికి చెప్పక్కర్లేదు - **కౌసల్య.**

ప్రాణేష్‌కి చెమటలు పట్టాయి. రెండు నెలల సెలవులు. హాయిగా రెస్ట్ తీసుకోకుండా ఎండలో తిరుగుతూ ఈ పనులన్నీ చేయాలా?

'నెవర్' అనుకున్నాడు. 'నో' అని కూడా అనుకున్నాడు.

మన్ను తిన్నపాములా ఉండే అతని బుర్ర చురుగ్గా పనిచేయసాగింది.

"హాయ్! ఇవాళ లిస్ట్‌లోని ఏ ఏ పనులు పూర్తిచేసావు?" సాయంత్రం ఆఫీస్ నించి వచ్చాక అడిగింది కౌసల్య.

"నేను మా ఊరు వెళ్తున్నాను." దానికి సమాధానంగా చెప్పాడు ప్రాణేష్.

"మీ ఊరా? ఎందుకు? పవర్‌కట్. రోజుకి పన్నెండు గంటలు కరెంటు ఉండదుట. చచ్చిపోతావ్" చెప్పింది కౌసల్య.

"మా అమ్మకి ఒంట్లో బావుండలేదుట. 'సెలవలిచ్చారు కదరా. వచ్చి నన్ను చూసి వెళ్ళొచ్చుగా?' అని ఫోన్ చేసింది పాపం."

"అయ్యో పాపం! వీకెండ్ దాకా ఆగితే నేనూ వస్తాను. ఇద్దరం వెళ్దాం." చెప్పింది.

"లేదు లేదు. ఇవాళ రాత్రికే వెళ్తున్నాను. మనం వెళ్ళేలోగా మా అమ్మకి ఏమైనా అయితే నన్ను నేను క్షమించుకోలేను." సీరియస్‌గా చెప్పాడు.

అతన్ని పరీక్షగా చూసి చెప్పింది కౌసల్య.

"సరే."

ఆ రాత్రి ఇంట్లో భర్త లేకపోతే వెలితిగా అనిపించింది. ఆ బద్ధకం లేకపోతే ప్రాణేష్ బంగారం అనుకుంది.

నిద్రలేవగానే ప్రాణేష్ నించి మెసేజ్ వచ్చిందేమోనని చూసింది. లేదు. ఈ పాటికి ఇల్లు చేరి ఉండాలి. మెసేజ్‌కి బద్ధకమైతే ఫోన్ చేసి చెప్పచ్చుగా అని విసుక్కుంటూ భర్తకి ఫోన్ చేసింది. సోఫాలో ఉన్న ప్రాణేష్ ఫోన్ రింగైంది.

"స్టుపిడ్ ఫెలో. ఫోన్ మర్చిపోయి వెళ్ళాడు." ఆమె విసుగురెట్టింపైంది.

అత్తగారి లేండ్‌లైన్ నంబర్‌కి ఫోన్ చేసింది. ఆవిడ ఫోన్ ఎత్తగానే చెప్పింది.

"అత్తయ్యా నేను కౌసల్యని."

"ఆఁ ఏమిటి చెప్పు?"

"ఎలా ఉన్నారు?"

"నాకేం దుక్కలా ఉన్నాను." ఆవిడ కటువుగా చెప్పింది.

"మంచిది. ప్రాణేష్‌కివ్వండి ఫోన్. సెల్‌ఫోన్ మర్చిపోయి వెళ్ళారు."

"తెల్లారుఝామున ఎప్పుడో వచ్చిపడుకున్నాడు. లేచాక నీకు ఫోన్ చేయమని చెప్తాలే." ఆవిడ ఫోన్ కట్ చేసింది.

క్షేమ సమాచారం తెలియడంతో కౌసల్యకి నిశ్చింతగా అనిపించింది.

లంచ్ టైంలో మళ్ళీ అత్తగారి నంబర్‌కి ఫోన్ చేసింది. ఓ నిమిషం తర్వాత ప్రాణేష్ 'హలో' అన్నాడు.

"ఫోన్ మర్చిపోయి వెళ్తే ఎలా? ఏదైనా ఎమర్జెన్సీ వస్తే ఎవరికి చెప్పాలి?" అరిచింది.

"బస్సు వెళ్ళిపోతుందని హడావిడిగా వచ్చేసాను. పోనీ ఓ పనిచెయ్. ఫోన్ కొరియర్‌లో పంపించు" సలహా ఇచ్చాడు.

"కొరియర్లో పంపాలా? ఎంతకాలం మకాం?"

"ఏమో ఇంకా అనుకోలేదు."

"మీ అమ్మ దుక్కలా ఉన్నారట. అబద్ధం ఎందుకు చెప్పావు?"

"నిన్న మధ్యాహ్నం నిద్రలో మా అమ్మకి బాలేదన్నట్లు కల వచ్చింది. దాంతో మెలుకువ వచ్చింది. వెంటనే అమ్మని చూడాలని పించింది. ఆ ట్రాన్స్‌లో ఉన్నానేమో అదే చెప్పాను నీకు."

"నీ మొహానికి మదర్ సెంటిమెంట్ ఒకటి" ఫోన్ పెట్టేసింది.

వారం తర్వాత మరోసారి ఫోన్ చేసి అడిగింది.

"ఏం చేస్తున్నావు?"

"అమ్మ సున్నుండలు చేసింది తింటున్నా."

"తిన్నది చాలుకాని బస్సెక్కు. పనులన్నీ ఆగిపోయాయి."

"అమ్మ సెలవలేగా ఉండు అంటోంది."

"మదర్ సెంటిమెంట్ వద్దు ప్రాణేష్. ప్లీజ్. వారం దాటింది. ఒక్కదాన్నే ఉంటే విసుగ్గా ఉంది. వచ్చెయ్" ప్రాధేయపడింది.

ఇంతలో ఫోన్‌లో అత్తగారి గొంతు వినపడింది.

"నువ్వెటూ నన్ను చూడటానికి రావు. వాడినైనా ఉండనీయచ్చుగా. సెలవులేగా?"

"వీకెండ్ దాకా ఆగితే నేనూ వస్తానన్నాను. ఆగకుండా వచ్చాడు." సంజాయిషీగా చెప్పింది.

మళ్ళీ ప్రాణేష్ గొంతు వినిపించింది.

"విన్నావుగా. అమ్మ ఎప్పుడు పొమ్మంటే అప్పుడు వస్తా."

"బుద్ధుందా నీకు? మాట్లాడేప్పుడు ఫోన్ మీ అమ్మకిస్తావా? ఇచ్చేముందు నాకు చెప్పక్కర్లేదూ?" అరిచి ఫోన్ పెట్టేసింది.

పంతంగా రెండువారాలు ఫోన్ చేయలేదు. అతనూ చేయలేదు.

'హాయిగా అమ్మ చేసి పెడుతూంటే మెక్కుతూ కూర్చున్నాడు' కసిగా తిట్టుకుంది.

నెల తర్వాత ఫోన్ చేసింది. అత్తగారు ఫోన్ తీసి చెప్పారు.

"ఇంకో నెల సెలవులు ఉన్నాయిగా. అప్పుడు వస్తాడు."

ఆవిడ తనమీదున్న అకారణ కోపాన్ని ఇలా తీర్చుకుంటుందేమో అనిపించింది కౌసల్యకి.

"సరే. అక్కడే ఉండనివ్వండి. ఆయనతో మాట్లాడాలి పిలుస్తారా?" మర్యాదగా అడిగింది.

"చెప్పు" ప్రాణేష్ లైన్‌లోకి వచ్చాడు.

"బాగా ఎంజాయ్ చేస్తున్నారా?" అడిగింది.

"ఆహాఁ అమ్మ నీలా పనులు చెప్పదు." చిన్నపిల్లాడిలా చెప్పాడు.

"నేనూ చెప్పనులే. నా పనులన్నీ అయిపోయాయి."

"నువ్వే చేసుకున్నావా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"లేదు. ఎదురు ఫ్లాట్ శ్రీకర్ చేసిపెట్టాడు. ఇంకా ఏదైనా పని ఉంటే చెప్పమని సతాయిస్తున్నాడు. ఇల్లంతా క్రిస్టల్ క్లీన్‌గా ఉంది. నో రిపేర్స్, నో దుమ్ము, నో ధూళి. మనిషికాదు. మనసుకూడా అందమైందే నువ్వు నీ కాలేజ్ రేపు తెరుస్తారు అనగా ఇవాళ రా. పర్లేదు..."

ఆమె చెప్తూండగానే ఫోన్ పెట్టేసి ప్రాణేష్ తల్లితో చెప్పాడు.

"అర్జెంట్ పనమ్మా. బయలుదేరతాను."

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments